ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

శుక్రవారం 25 అక్టోబరు 2024

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

- సాధారణ ప్రసవాల కోసం వైద్యులు కృషి చేయాలి
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

-రాయికల్ 8లో..

భూ సేకరణ సర్వేను వేగంగా పూర్తి చేయాలి

- కలెక్టర్ సత్య ప్రసాద్

-బుగ్గారం 8లో..

వెదురు బొంగులతో.. మినియేచర్స్

- అగ్గిపెట్టెలో ఇమిడే బుట్టలు, వ్యవసాయ పనిముట్లు
- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న నర్సయ్య

-రాయికల్ 7లో..

ధరల మోత.. ₹

- ఆకాశాన్నంటుతున్న టపాసుల రేట్లు
- బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలు
- జిల్లాలో సుమారు రూ. 70 లక్షల నుంచి రూ. కోటి వరకు వ్యాపారం



జగిత్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపావళి టపాసుల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. టపాసుల ధరలు ఆకాశాన్నంటడంతో వినియోగదారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. పండుగ పూట పటాకులు కాలుద్దామంటే జేబులు గుల్ల అవుతాయని ఆందోళన చెందుతున్నారు. చిన్న పెద్ద వృద్ధులతో సహా ఏదో ఒక టపాసులు కాల్చి ఆనంద పడుతుంటారు. ఇక పిల్లలైతే ఈ పండుగ ఎప్పుడోస్తుందని ఎదురు చూస్తుంటారు. చేతిలో డబ్బులు లేకపోయినా ఎలాగో అలా టపాసులు కొంటారు. టపాకాయల అమ్మకాలు జరిగేది మూడు, నాలుగు రోజులు అయినప్పటికీ రూ. కోట్లలోనే లావాదేవీలు ఉంటున్నాయి. ఈ డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు రెగ్యులర్ లెసెన్స్ వ్యాపారులు కాకుండా తాత్కాలిక లెసెన్స్‌లు పొంది దుకాణాలు పెట్టే వ్యాపారుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. అనధికార లెక్కల ప్రకారం జిల్లాలో రూ. 70 లక్షల నుంచి రూ. కోటి పైనే ఈ వ్యాపారం ఉంటుందని అంచనా ఉంది. అత్యధికంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి తదితర పట్టణాలలో సాగుతుంది. తరువాత మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎక్కువగానే ఉంటుంది.

వాతావరణంపై వ్యాపారుల ఆశలు...

రెండేళ్ల నుంచి వ్యాపారం కలిసి రాలేదని, అప్పటి వాతావరణ పరిస్థితుల్లో అల్పపీడనం కారణంగా వర్షాలు కురిశాయంటున్నారు. దీపావళి రోజున కొద్దిగా తెరిపి ఇవ్వడంతో వ్యాపారం మామూలుగానే జరిగిందంటున్నారు. తాత్కాలిక వ్యాపారులంతా నష్టపోయారని, అయితే ఈ సారి ప్రకృతి కలిసి వస్తుందన్న ఆశతో వ్యాపారులు ఉన్నారు. దానికి అనుగుణంగానే తాత్కాలిక లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేస్తున్నారు. మున్సిపాలిటీలు, పోలీసు, ఫైర్, రెవెన్యూ తదితర శాఖల నుంచి అనుమతి పొందారు. అత్యధికంగా పట్టణ ప్రాంతాల్లోనే దుకాణాలు వేసేందుకు మక్కువ చూపుతున్నారు.

మిగతా 8లో

ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ సమీయోద్దిన్

ఇంటర్వ్యూ



జగిత్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సమీయోద్దిన్ తెలిపారు. జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల రెవెన్యూ డివిజన్ల పరిధిలోని పట్టణాలు, మండలాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామని, నిబంధనలు అతిక్రమించిన వారికి షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు తదుపరి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి : ప్రైవేటు ఆసుపత్రుల్లో అక్రమాలు, ఫీజుల పేరిట దోపిడీ జరుగుతుందన్న ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

డీఎంహచ్‌వో: ఇటీవల జిల్లాలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల తీరుపై ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చాయి. సంబంధిత ఆసుపత్రులల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలు చేసి రికార్డులు పరిశీలిస్తున్నారు. నిబంధనలు పాటించని ఆసుపత్రుల నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశాము. పలు సందర్భాల్లో పోలీస్ స్టేషన్‌లో సైతం కేసులు నమోదు చేయిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి : ప్రైవేటు ఆసుపత్రుల్లో ఫీజుల నియంత్రణ ఎలా జరుగుతోంది..?

డీఎంహచ్‌వో: జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి తదితర ప్రాంతాల్లో గల పలు ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయి. సంబంధిత ఆసుపత్రులను సందర్శించి పరిశీలిస్తున్నాము. విధిగా ప్రతీ ఆసుపత్రిలో ఆయా సేవలకు నిర్ణీత ఫీజుల వసూలు బోర్డులను ప్రదర్శించాలని ఆదేశిస్తున్నాము.

మిగతా 8లో..

నవంబరు 1న కరీంనగర్‌కు బీసీ కమిషన్ బృందం

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థలవారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబరు 1న ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు విచ్చేయనుందని కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు సంబంధించి నవంబరు 1న కరీంనగర్‌లోని కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని సభ్యులు బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని వెల్లడించారు. అభిప్రాయాలు తెలపాలనుకునే వారు రాత పూర్వక సమర్పణలు నేరుగా సమర్పించవచ్చని సూచించారు.

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ఓపెన్ హౌజ్ కార్యక్రమంపై పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్పీ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి, శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతోంది అనే విషయాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం, సీసీ కెమరాలు, షీ టీం, భరోసా కేంద్రాల పనితీరుపై వివరించారు. పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, బాంబ్ స్క్వాడ్ తదితర విషయాలను క్షుణ్ణంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘు చందర్, ఆర్‌ఐలు కిరణ్ కుమార్, రామక్రిష్ణ, వేణు, ఐటీ కోర్, డీసీఆర్‌బీ, ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రఫీక్ ఖాన్, రాజు ఉన్నారు.



ఓపెన్ హౌజ్‌లో పాల్గొన్న విద్యార్థులతో ఎస్పీ

ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 26న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనాధికారి సత్తమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అకితోషి అగ్ర సొల్యూషన్ కంపెనీలో సేల్స్ రిప్రెజెంటేటివ్ 15, ఫ్యూచర్ ప్రాపర్టీస్ గ్రూప్ కేపీహెచ్‌బీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ 100 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు, సెలెక్ట్ అయినవారు జగిత్యాల, హైదరాబాద్‌లలో పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 26వ తేదీన ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోగా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న కె.అమూల్య అనే విద్యార్థి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అమూల్య హాజరవుతారని ఆమె తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులకు గురి చేయొద్దు

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, అక్టోబరు 24 : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 17 తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని, కటింగ్‌ల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. వ్యవసాయాధికారులు సర్టిఫై చేసిన సన్న రకం ధాన్యాన్ని రూ. 500 బోనస్‌తో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. మాజీ జడ్పీటీసీలు రాజేందర్‌రావు, శోభారాణి, పార్టీ అధ్యక్షులు రాములు గౌడ్ ఉన్నారు.

జగిత్యాల ప్రాంత అభివృద్ధే ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల ప్రాంత అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం నాటి నుంచే కాంగ్రెస్ పార్టీతో తమ కుటుంబానికి, తనకు సంబంధం ఉందన్నారు. వివిధ కారణాలతో మారుతున్న కాలానికి అణుగుణంగా గతంలో టీడీపీతో కలిసి పనిచేసానన్నారు. మెట్‌పల్లి ప్రాంతంలో బీజేపీకి చెందిన తన మిత్రుడు వెంకటరమణా రెడ్డితో పార్టీతో సంబంధం లేకుండానే ఆనాడు కలిసి పనిచేశామన్నారు. జగిత్యాల ప్రాంతానికి సీనియర్ నాయకుడిగా పేరున్న జీవన్ రెడ్డి ఏనాడైనా తనను కాంగ్రెస్ పార్టీలో చేరమని అహ్వానించలేదన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వంలో కలిసి పనిచేస్తున్నానన్నారు. జగిత్యాల ప్రాంత అభివృద్ధికి సహకరిస్తారనే హామితోనే పార్టీలోకి సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారన్నారు. ఇప్పటికీ తనను కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకోవాలని అడుగలేదని, బీఆర్ఎస్ పార్టీకి తాను రాజీనామా చేయలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకుని జగిత్యాల ప్రాంత అభివృద్ధికి సహకరిస్తానని అనడంతో పార్టీకి చెందిన మంత్రులు, పీసీసీ అధ్యక్షుని సహకారంతో ముందుకు వెళుతున్నానన్నారు. జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు తనతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు,

పదవి పోతుందనే ఎమ్మెల్యే అర్థరహిత వ్యాఖ్యలు

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :పార్టీ ఫిరాయింపుల విషయంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తన పదవి పోతుందనే భయంతో అర్థరహిత వాఖ్యలు చేస్తున్నారని జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం వసంత విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ బి ఫామ్ మీద గెలిచి అర్ధరాత్రి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న రోజే కాంగ్రెస్ వ్యక్తిగా సంజయ్ కుమార్ మారారన్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకోకపోతే గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ సమావేశానికి ఎందుకు హాజరయ్యారో సమాధానం చెప్పాలన్నారు. సంజయ్ కుమార్‌కు రాజకీయంగా జన్మనిచ్చిన పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్యేగా ఎదిగేలా చేసిన నాయకురాలు కవిత అని వివరించారు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో జరిగిన హత్యను పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. హత్యకు బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు, ఈ సమావేశంలో నాయకులు గట్టు సతీష్, ఆనంద్ రావు, దేవేందర్ నాయక్ ఉన్నారు,



సమావేశంలో మాట్లాడుతున్న దావ వసంత

బిర్యానీ సెంటర్లలో తనిఖీలు

కోరుట్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్‌లలో గురువారం మున్సిపల్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి ఆదేశాల మేరకు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నూనె పాత్రలు శుభ్రం లేనందున వాటిని పరిశీలించి 12,500 జరిమాన విధించినట్లు తెలిపారు. నాసిరకం పదార్థాలు వాడి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్‌స్పెక్టర్ బాలే అశోక్, సిబ్బంది జగదీశ్వర్, రమేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

చిట్టీల వ్యాపారి అరెస్టు

జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఫైనాన్స్ నిర్వహించి, అమాయకుల వద్ద చీటీలు డబ్బులు తీసుకుని కోట్లాది రూపాయలతో పారిపోయిన గాండ్ల వెంకన్న అనే వ్యక్తిని గురువారం టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. చిటీలు వేసిన వారి పూర్తి వివరాలు సేకరించి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ పేర్కొన్నారు.

జగిత్యాలలో మహిళ అదృశ్యం

జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని బస్ డిపో ప్రాంతానికి చెందిన అన్నపూర్ణ(35)అనే మహిళ గురువారం ఇంటి నుంచి బయటకి వెళ్లి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

- గన్నిసంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలి
- కలెక్టర్ సత్యప్రసాద్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : ఐకేపీ సెంటర్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల, గుల్లపేట గ్రామాల్లో ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, కంపోస్ట్, డంపింగ్‌యార్డులను ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో గన్నిబ్యాగులు టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆధార్, పట్టాపాసుబుక్ వంటి వివరాలను కేంద్రాల్లో పెట్టాలని సూచించారు. అనంతరం ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు.

కొనుగోలు కేంద్రంలో సరిపడా ప్యాడీ క్లీనింగ్ మెషిన్స్ అందుబాటులో ఉంచాలని, ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడవకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు ఆరబెట్టిన వరిధాన్యాన్ని క్లీనింగ్‌చేసి కొనుగోలు చేయాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయితీలో ట్రాక్టర్‌ద్వారా తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా ప్రతి ఇంటి నుంచి సేకరిస్తున్నారన్నారు. పొడిచెత్తను సెగ్రిగేషన్ షెడ్డుద్వారా క్రాప్ డీలర్లకు విక్రయించాలని సూచించారు. పొడిచెత్త అనేది గాజు ప్లాస్టిక్ గాజు ఇతరభూమిలో కలవని చెత్త అని పేర్కొన్నారు. తడిచెత్త అనేది కూరగాయల వెస్ట్ అని దానితో కంపోస్టు, వర్మీకవపోస్ట్‌గాని తయారు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, అడిషనల్ డీఆర్‌డీఏ మదన్‌మోహన్, తహసీల్దార్ శ్రీనివాస్. ఎంపీడీవో రమాదేవి పాల్గొన్నారు.

రహదారికి పోలీసుల మరమ్మతులు

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మల్యాల క్రాస్ రోడ్డు నుంచి బ్లాక్ చౌరస్తా వరకు గుంతలతో ప్రమాదకరంగా మారిన రహదారిపై మరమ్మతులు చేసి గుంతలను పూడ్చివేశారు. ఈ రహదారిపై ప్రయాణానికి ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతుండడంతో ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గుంతలలో మట్టి, డస్ట్ ఇతరాత్ర పోసి గుంతలకు మరమ్మతులు చేశారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మరమ్మతులు చేయిస్తున్న పోలీసులు

ప్రజలకు చేరువయ్యేలా విధులు ఉండాలి

ఎస్పీ అశోక్ కుమార్

బీర్‌పూర్, అక్టోబరు 24: ప్రజలకు మరింత చేరువయ్యేల పోలీస్ విధులు ఉండాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం బీర్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని మండలంలో అసాంఘిక కార్యకలాపాలను నివారించడానికి ప్రత్యేకంగా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బీర్‌పూర్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేష్ అని అభినందించారు. ప్రజా సమస్యలపైన వెంటనే స్పందిస్తూ బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌ని సంప్రదించవచ్చునని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో పెట్రోల్ కార్, బ్లూ కోట్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు దూరంగా ఉన్నప్పటికి 10 నిమిషాల్లో చేరుకునే విధంగా పని చేస్తున్నారన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో 5ఎస్ అమలు చేసిన తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి డ్యూటీల గురించి తెలుసు కొని స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు, ఫైల్స్ క్రమ పద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సిబ్బందికి ఏ మైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని అన్నారు.

స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బీర్‌పూర్ ఎస్సై కుమార స్వామి, ఏఎస్సై గజేందర్, సిబ్బంది ముత్తయ్య, వెంకటేష్ ఉన్నారు.



సిబ్బంది యునిఫామ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

క్రైం కార్నర్

వాహన తనిఖీల్లో గంజాయి పట్టివేత

గంగాధర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీల్లో కిలో 70 గ్రాముల గంజాయిని పట్టుకున్నామని చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. గంగాధరలో బుధవారం అర్ధరాత్రి ఎస్సై నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో యాసిన్, కొత్తపల్లి ఆదిత్య, వాజీదిపాషా అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని ప్రశ్నించగా గంజాయి అమ్ముతున్నామని తెలిపారు. తనిఖీ చేయగా కిలో 70 గ్రాముల గంజాయి పట్టుబడింది. వీరు నాగపూర్ నుంచి కొనుగోలు చేసి తాము తాగుతూ మండలంలోని చుట్టు పక్కల గ్రామాల్లోని యువత, కార్మికులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. పట్టుబడిన గంజాయి విలువ 26, 170 రూపాయలు ఉంటుందని, ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. గంజాయిపై ఉన్నతాధికారుల సూచన మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు వ్యక్తులు వేర్వేరు చోట్ల ఆత్మహత్యకు పాల్పడ్డారు. భూమి విషయంలో మనస్తాపం చెంది ఒకరు, అప్పుల ఒత్తిడి భరించలేక ఒకరు, ఇష్టం లేని పెళ్లి చేశారని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు.



నర్సయ్య(ఫైల్)

కోల్‌సిటీ, అక్టోబరు 24: గోదావరిఖనికి చెందిన సింగరేణి కార్మికులు మాలంశెట్టి నర్సయ్య(49) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్‌లో కొందరు బ్రోకర్లు నమ్మించడంతో రూ.80లక్షలు అప్పు చేసి భూమిని కొనుగోలు చేశాడు. తరువాత ఆ స్థలం వివాదంలో ఉందని తెలియడంతో పలుమార్లు సెటిల్‌మెంట్లకు ప్రయత్నించాడు. రెండు రోజుల క్రితం కరీంనగర్‌కు వెళ్లి సెటిల్‌మెంట్ కోసం చర్చలు జరిపాడు. అతడితో భూమి కొనుగోలు చేయించిన సర్వ శ్రీనివాస్ అనే వ్యక్తి సహకరించకపోగా, ఎదుటి వారి పక్షాన మాట్లాడినట్టు నర్సయ్య మదనపడ్డాడు. బుధవారం తెల్లవారు జామున ఇంట్లో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గోదావరిఖని విఠల్‌నగర్ పోస్టాఫీస్ వద్ద సింగరేణి క్వార్టర్లలో నర్సయ్య నివాసముండేవాడు. అత డికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు గతంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్న కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అప్పుల ఒత్తిడితో బెహరాన్‌లో వేంపేట వాసి..



సుధీర్(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన యువకుడుఅప్పుల ఒత్తిళ్ల నేపథ్యంలో బెహరాన్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. వేంపేటకు చెందిన మారంపల్లి సుధీర్ (35)కు భార్య ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. జీవనోపాధి కోసం రెండున్నరేళ్ల క్రితం సుధీర్ బెహరన్ వెళ్లాడు. కుటుంబ పోషణ కోసం తీసుకున్న అప్పులు ఇచ్చిన వారి ఒత్తిళ్లు ఎక్కువ య్యాయి. దీంతో బెహరాన్‌లో నివా సం ఉం టున్న తన గదిలోనే బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు స్నేహి తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సుధీర్ మృతి చెంది ఉన్న ఫొటోలు చూసి ఆయన మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుధీర్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గ్రామస్థులు కోరారు.

ఇష్టం లేని పెళ్లి చేశారని యువకుడు..

గంగాధర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం నారాయణపూర్‌కు చెందిన యువకుడు ఇష్టంలేని పెళ్లి చేశారని బుధవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చింతలతాడేపు మహేష్(29)కు ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. కాగా తనకు ఇష్టలేని వివాహం చేశారని మనస్తాపంతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహేష్ తల్లి దేవవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సైబర్ వలలో జిల్లా యువత

- ఉపాధి కోసం లావోస్ వెళ్లి తిరిగి రాక
- ఏజెంట్ మోసంపై ఎస్పీకి ఫిర్యాదు



ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులు

రాయికల్/ జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి కరువై ఇతర దేశాల్లో ఉపాధి కోసం వెళ్తే ఏజెంట్ల మాయ మాటలకు నిరుద్యోగ యువత మోసాలకు గురవుతున్నారు. తాజాగా జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు యువకులు సైబర్ వలలో చిక్కకుండా తిరిగి స్వదేశానికి వచ్చిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం రాయికల్ మండలం తాట్లవాయికి చెందిన చెట్లపల్లి మహేష్, గాండ్ల అనిల్ కుమార్, అల్లీపూర్‌కు చెందిన చెలుముల ప్రవీణ్, జగిత్యాలకు చెందిన అయ్యోరి మోహన్ రాయికల్ మండలానికి చెందిన ఓ ఏజెంట్ ద్వారా ఉపాధి కోసం లావోస్ వెళ్లడానికి ఒక్కొక్కరు రూ.1.50 లక్షలు చెల్లించారు. సెప్టెంబరు 30న నలుగురిని బ్యాంకాక్ తీసుకువెళ్లి అక్కడి నుంచి వాహనాల్లో లావోస్ తీసుకువెళ్లారు. అక్కడ డాటా ఎంట్రీ ఉద్యోగం అని చెప్పి నగరానికి దూరంగా ఉంచి శిక్షణ పేరుతో భారతదేశంలోని వ్యక్తుల నుంచి సైబర్ మోసాలు చేయడానికి మెళకువలు నేర్పిస్తున్నారు. గమనించిన యువకులు సైబర్ నేరాలు తాము చేయమని అక్కడి తెలుగు వారి సహాయంతో యువత అక్కడి నుంచి తప్పించుకుని తిరిగి స్వదేశానికి వచ్చారు. వచ్చిన అనంతరం ఏజెంట్‌ను కలిసి తమను మోసం చేశావని, తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా ఏజెంట్ పట్టించుకోకపోవడంతో బాధితులు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ఆలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వీపర్‌గా విధులు నిర్వహించే బక్కయ్య అనే ఉద్యోగి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రసాద కౌంటర్ వద్ద విధులు నిర్వహించే బక్కయ్యకు ఏళ్ల తరబడిగా కొండపైన నివాసముంటున్న ఓ భక్తురాలికి మధ్య నెల రోజుల క్రితం అల్పాహారం విషయమై వివాదం ఏర్పడడంతో బక్కయ్య దేవస్థానం అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇందుకు దేవస్థానం ఉద్యోగి ఒకరు భక్తురాలికి మద్దతు పలుకుతున్నారని ఆరోపించగా కొద్ది రోజుల తరువాత ఈ విషయం సద్దుమనిగింది. మళ్లీ రెండు రోజుల క్రితం ఆ భక్తురాలు ప్రసాద కౌంటర్ వద్దకు రావడంతో కౌంటర్‌లో విధులు నిర్వహించే మరో ఉద్యోగి, బక్కయ్యకు భక్తురాలి విషయమై మళ్లీ వాగ్వాదం చోటుచేసుకుంది. కాగ బక్కయ్య అదే రోజు క్రిమిసంహారక మందు తాగడంతో చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ తీసుకెళ్లారు. ప్రస్తుతం కోలుకుంటున్నట్లు ఆలయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ విషయం కొండపైన చర్చనీయాంశంగా మారింది. ఏళ్ల తరబడి తిష్ట వేసిన భక్తులతో ఆలయ ఉద్యోగుల్లో గొడవలు జరుగుతున్నట్లు పలువురు చెబుతున్నారు.

వావ్..వర్షిణి..

డ్యాన్సర్, గాయని, నటిగా రాణిస్తున్న 'ఖని' యువతి

ట్రెండింగ్



చిన్ననాటి నుంచి ఆమెకు డ్యాన్సంటే ప్రాణం... ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడైంది.. సెకండ్ క్లాస్‌లో స్టేజీపై మొదలైన స్టెప్పులే... నేడు డ్యాన్సర్‌గా తన సత్తాను చాటుకుంటోంది. అంతేకాకుండా గాయనిగా... నటిగా... డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్నది... ఆమె చేసే డ్యాన్స్ పాటకు ప్రాణం పోస్తుంది... వీక్షకులను హుషారెత్తిస్తుంది... తన టాలెంట్‌కు యూట్యూబ్‌లో లక్షల వ్యూస్‌తో దూసుకెళుతోంది. బుల్లితెరపై పలు షోలతో పాటు దేశవిదేశాల్లో ఎన్నో ప్రదర్శనలిస్తూ అందరి ప్రశంసలందుకుంటోంది గోదావరిఖని 'మహానటి'గా గుర్తింపు తెచ్చుకున్నది వరుమణి వర్షిణి..

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన వరుమణి వర్షిణి డ్యాన్సర్‌గా, గాయనిగా, నటిగా రాణిస్తూ అందరి ప్రశంసలందుకున్నది. ఫోటో తీస్తున్నడే సీమ దసరా చిన్నోడు అంటూ సాగే పాటలో అదిరిపోయే స్టెప్పులతో వీక్షకులను ఉర్రూతలూగించింది వర్షిణి. ఈ పాటకు యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్ వచ్చాయి.

వర్షిణి ప్రస్థానం..:

డ్యాన్స్ ప్రదర్శనలిస్తూనే 2021లో రీల్స్ చేయడంతో పాటు యూట్యూబ్‌లో వివిధ ప్రైవేట్ ఆల్బమ్స్‌లో నటించింది. వర్షిణి నటించిన ఇద్దరు చొక్కా, నాయిదోరో..చిన్నదోర, ఫోటో తీస్తున్నాడే సీమ దసరా చిన్నోడు పాటలు విశేషంగా ఆదరణ పొందాయి. యూట్యూబ్‌లో తన పాటలతో మిలియన్‌లలో వ్యూస్ రావడంతో గత సంవత్సరం ఆమెకు జబర్దస్త్ టీవీ షోలో నటించే అవకాశం వచ్చింది. అలాగే శ్రీదేవి డ్రామా కంపెనీ షోలో పలు ప్రదర్శనలు ఇస్తూ విశేష ఆదరణ పొందుతున్నది. అంతేకాకుండా త్వరలో విడుదల కానున్న ఓ చిత్రంలో హీరోయిన్ పాత్రకు డబ్బింగ్, మరో రెండు సినిమాలలో సైడ్ క్యారెక్టర్‌గా నటిం చింది. ప్రస్తుతం తెలుగు, తమిళ్, కన్న డం మూడు భాషాల్లో చిత్రీకరిస్తున్న చిత్రంలో వర్షిణి నటిస్తున్నది.

నటిగా.. ఉపాధ్యాయురాలిగా సేవలందించాలి..

వరుమణి వర్షిణి

మా అమ్మానాన్నలు వేణుమాధవ్, వాణి ప్రైవేట్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం టీవీ షోలతో పాటు తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లో నటిస్తున్నాను. మంచి నటిగా రాణిస్తూ గుర్తింపు పొందడంతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలన్నది నా లక్ష్యం.





టీవీ షోలో నటి ఇంద్రజతో డాన్స్ చేస్తున్న వర్షిణి, టీవీ షోలో వ్యాఖ్యాతగా...



సాంగ్ షూటింగ్‌లో..

కేర్‌టేకర్‌గా వచ్చి చోరీ

జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేర్‌టేకర్‌గా వచ్చి ఇంట్లో వారితో నమ్మకంగా మెదిలిన ఓ వ్యక్తి ఆ ఇంటికే కన్నం వేశాడు. జిల్లా కేంద్రంలోని బీట్ బజార్ ప్రాంతానికి చెందిన కోటగిరి శ్రీనివాస్ తన తండ్రి చంద్రశేఖర్‌కు సర్జరీ కావడంతో కేర్‌టేకర్ కోసం హైదరాబాద్‌లోని వశిష్ట హోం కేర్ సర్వీసెస్‌ను సంప్రదించాడు. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం దొంతమూరు గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రాజు అనే వ్యక్తిని నెలకు రూ. 22 వేల వేతనంతో కేర్‌టేకర్‌గా శ్రీనివాస్ ఇంట్లో నియమించింది. మూడు నెలల పాటు నమ్మకంగా పనిచేసిన రాజు 20 రోజుల క్రితం స్వగ్రామం వెళ్లాడు. బుధవారం జగిత్యాలకు వచ్చి శ్రీనివాస్ ఇంట్లో తిరిగి పనిచేస్తానంటూ నమ్మించాడు. రాత్రి సమయంలో బీరువాలో ఉన్న రూ. 99,500 నగదును అపహరించుకవెళ్లాడు. ఇంట్లో ఉండాల్సిన రాజు కనబడకపోవడంతో సీసీ పుటే జీల ద్వారా చోరికి పాల్పడ్డట్లు గుర్తించారు. జరిగిన సంఘటనపై బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆసుపత్రిలో చోరీ...

జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో ఉన్న సాయినీస్ డెంటల్ కేర్ ఆసుపత్రిలో బుధవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆసుపత్రి కిటికీలు పగులగొట్టి రూ. 55 వేల విలువగల ఐఫోన్‌తో పాటు విలువైన వస్తువులు అపహరించుకవెళ్లారు. అభిషేక్ రాజ్ ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్యజ్యోతి): తలకు గాయాలతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కరీంనగర్ మారుతినగర్‌కు చెందిన ఎండీ అక్బర్ ఖాన్(44) గురువారం ఉదయం మృతి చెందాడని కరీంనగర్ మూడో ఠాణా పోలీసులు తెలిపారు. అక్బర్ ఖాన్ పెయింటర్‌గా పనిచేస్తుం డేవాడని, ఇటీవల మద్యం సేవించి పడిపో తుండేవాడని కుటుంబ సభ్యులు పోలీసు లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 15 రోజుల కిందట తలకు గాయం కాగా మళ్లీ ఈ నెల 21న కిందపడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లగా కరీంనగర్ ప్రభుత్వ ఆసు పత్రిలో చికిత్స అందించినట్లు తెలిపారు. అనంతరం ఎంజీఎంకు తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

దైవారాధనతోనే సత్ఫలితాలు

నైమిశారణ్య పీఠాధిపతి పూజలు



స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో శ్రీనివాస్

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దైవారాధన ద్వారానే సత్ఫలితాలు సాధ్యమవుతాయని నైమిశారణ్య పీఠాధిపతులు బాల బ్రహ్మా నంద సరస్వతి స్వామి అన్నారు. ప్రతి వ్యక్తి భగవంతుడిని నిత్యం పూజించాలని తెలిపారు. ధర్మపురి క్షేత్రంలో స్వామి గురువారం ఉదయం ప్రవచనాలు చేశారు. లక్ష్మీ నరసింహ స్వామి వారి లీలా విలాసనం గురించి ప్రవచనాలు చేశారు. అంతకు ముందు స్వామి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయం వద్ద పీఠాధిపతులకు అధికారులు, వేదపండితులు, అర్చకులు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించారు. అంతకు ముందు ఆయన యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీ పంలో నూనె పోశారు. ఆయన వెంట ఆలయ ఈవో సంక టాల శ్రీనివాస్, వేదపండితులు పాల్గొన్నారు.

యాపిల్‌ఫోన్ నకిలీ విడిభాగాల అమ్మకాలు

- 4 మొబైల్ షాపులపై కేసులు నమోదు



మొబైల్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రాజన్న

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో యాపిల్ మొబైల్‌ఫోన్ బ్రాండ్‌తో షాపుల్లో వినియోగ దారులకు విక్రయిస్తున్న నకిలీ మొబైల్ విడిభాగాలు, అనుబంధ పరికరాలు పట్టుబడ్డాయి. యాపిల్‌ఫోన్‌కు అనుబంధమైన పవర్ ఎడాప్టర్, ఇయర్‌బర్డ్స్, లైటింగ్ కేబుల్, బ్యాక్ కవర్లు బ్రాండెడ్‌గా చూపుతూ వ్యాపారులు విక్రయిస్తున్నట్లు ఆపిల్‌ఫోన్ కంపెనీ ఫిర్యాదుతో కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్ల కోటేశ్వర్ ఆధ్వర్యంలో షాపులలో తనిఖీలు నిర్వహించగా పలు రకాల నకిలీ పరికరాలు పట్టుబడ్డాయి. యాపిల్ ఫోన్ కంపెనీకి సంబంధించిన పేరుతో నకిలీ పరికరాలు, విడిభాగాలు విక్రయిస్తున్న అన్నపూర్ణ కాంప్లెక్స్‌లోని పంచరతన్ మార్కెటింగ్‌షాపు. శ్రీజ మొబైల్ స్పేర్‌పార్ట్స్ మహాలక్ష్మి సెల్ వరల్డ్, చాముండా మొబైల్ షాపుల యజమానులపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు. నకిలీ విడిభాగాలు, పరికరాలను సీజ్ చేశామనిని, అక్రమాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం రెండో బైపాస్ రోడ్డు చంద్రంపేట చౌరస్తా వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదు రుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఇదే సమ యంలో పెట్రోలింగ్ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. బైపాస్ రోడ్డులోని చంద్రంపేట చౌరస్తా వద్ద చీకటిగా ఉండడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

ఉపకార వేతనం.. భవితకు ఊతం..

పేద విద్యార్థులకు వరంగా ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్

సమాచారం



చదువుకోవాలనే తపన ఉన్న విద్యార్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు విధాలుగా ప్రోత్సహిస్తున్నాయి. చదువులో ప్రతిభ ఉన్న విద్యార్థుల కోసం ఉపకార వేతనాలు అందిస్తున్నాయి. అటువంటిదే కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్ఎంఎంఎస్). ఈ ఉపకార వేతనాన్ని జాతీయ స్థాయిలో పరీక్ష నిర్వహించి అందజేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందకు అర్హులు. అర్హత సాధించిన విద్యార్థులు తొమ్మిదో తరగతి నుంచి ఐదు సంవత్సరాలపాటు 12 వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్ పొందవచ్చు.

హుజూరాబాద్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చదుకోవాలనే తపన ఉన్నా.. ఆర్థిక స్తోమత లేక ఎంతోమంది విద్యార్థులు తమ చదువులను అర్ధంతరంగా ఆపేసిన సంఘటనలు ఉన్నాయి. ఈ తరుణంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఊతం అందిస్తోంది. వీటిని అందిపు చ్చుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తూ.. ముందు కు సాగుతున్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలు (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం - ఎన్ఎంఎంఎస్) అందిస్తోంది.

నాలుగేళ్లపాటు ఉపకారం అందుకుంటూ ఉన్నత చదువులు చదివే అవకాశముంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయస్థాయిలో పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏటా 12 వేల రూపాయల చొప్పున తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం వరకు ఐదేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. నవంబరు 24న పరీక్ష నిర్వహిస్తారు.

పరీక్ష స్వరూపం

పరీక్షలో మొత్తం 180 మార్కులకు రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్-1 మానసిక సామర్థ్య పరీక్ష. ఇందులో 90 ప్రశ్నలకు 90 మార్కులుంటాయి. రీజనింగ్, ఎబిలిటిస్, సంఖ్యా శాస్త్రం, పదాల భిన్న పరీక్ష, నంబర్, అనాలజీ, అల్ఫాబెట్ అనాలజీ, కోడింగ్ డీకడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్‌చిత్రాలు, మిర్రర్ ఇమేజెస్, వాటర్ ఇమేజెస్ అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. వీటిని సాధన చేయాలి. పార్ట్-2లో ఏడు, ఎనిమిదో తరగతి సిలబస్ నుంచి 90 ప్రశ్నలుంటాయి. 90 మార్కులుంటాయి. గణితం 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవ శాస్త్రం కలిపి 35 మార్కులుంటాయి. పరీక్ష ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో మల్టిపుల్ చాయిస్ రూపంలో ఉంటుంది.

న్యూస్ బాక్స్

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు హృతికేశ్ ఎంపిక



పతకం అందుకుంటున్న హృతికేశ్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు జిల్లాకు చెందిన వంగల హృతికేశ్ ఎంపికయ్యాడు. హైదరాబాద్‌లో ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభచాటి రజత పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ వేణుగోపాలక్ష తెలిపారు. ఈ సందర్భంగా హృతికేశ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ వై సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరి శంకర్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ బి మధుసూదన్‌రెడ్డి అభినందించారు.

28న జాబ్ మేళా

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ టాస్క్(తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్‌సెంటర్) ఆధ్వర్యంలో ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కల్వకుంట రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. డిగ్రీ లేదా ఇంటర్ పాసైన వారు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. కనీస వయస్సు 28 సంవత్సరములు దాటకూడదని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భగ్గుమన్న విభేదాలు

- ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అనుచరుల పరస్పర దాడులు
- పలువురిపై కేసు నమోదు

జగిత్యాల క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. అనుచరుల మధ్య జరిగిన ఓ భూ వివాదంలో ఒకరిపై మరొకరు దాడి చేసుకోగా జగిత్యాల రూరల్ ఠాణాలో కేసులు నమోదయ్యాయి. జగిత్యాల పట్టణంలోని ఒకటవ వార్డు కౌన్సిలర్ కూసరి అనీల్, జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన బండారి వెంకటరాజంలకు మధ్య తిప్పన్నపేట గ్రామ శివారులో ఉన్న భూముల విషయంలో కొన్ని రోజులుగా తగాదాలు నడుస్తున్నాయి. ఈనెల 18వ తేదీన శుక్రవారం ఇదే భూమి విషయంలో వెంకట రాజం, అనీల్‌కు మధ్య వివాదం ముదిరి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాలు జగిత్యాల రూరల్ పోలీసులకు అదే రోజు ఫిర్యాదు చేయగా పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. అయితే కౌన్సిలర్ కూసరి అనీల్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరుడిగా గుర్తింపు ఉండగా, బండారి వెంకట్రాజం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మనిషి కావడంతో ఈఘటన జగిత్యాలలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మూడు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడు మారు గంగారెడ్డి హత్య సంచలనం సృష్టించింది. ఆయన హత్యకు భూ వివాదమే కారణమని భావిస్తున్నారు. ఈ ఘటన మరవకముందే మరో భూ వివాదం వెలుగులోకి రావడంతో చర్చనీయాంశంగా మారింది.

చిన్న కొడుకుకు తండ్రి భూమి పట్టా చేసే యత్నం

- అడ్డుకున్న మిగతా కొడుకులు



పురుగుల మందు డబ్బా తీసుకుంటున్న పోలీసులు

ఇల్లందకుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు కొడుకులు ఉన్నప్పటికీ ఓ తండ్రి తన పేరిట ఉన్న 1.08గుంటల భూమిని గురువారం చిన్న కొడుకుకు పట్టా చేసే యత్నం చేయగా మిగతా ఇద్దరు కుమారులు పురుగుల మందు డబ్బా చేతిలో పట్టుకుని అడ్డుకున్న సంఘటన ఇల్లందకుంట తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. ఇల్లందకుంట మండలంలోని శ్రీరాముల పల్లి గ్రామానికి చెందిన అంబరిగుంట రాము లుకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతడికి సర్వే నంబర్ 180లో 19.08ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో నుంచి ముగ్గురు కొడుకులకు 6ఎకరాల చొప్పున గతంలోనే వాటాలు పంచాడు. మిగితా 1.08గుంటల భూమి రాములు పేరిట ఉంది. ఆ భూమిని చిన్న కొడుకు అయిన తిరుపతికి పట్టా చేసేందుకు సేల్ డీడీతో గురువారం తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న మిగితా ఇద్దరు కుమారులు శ్రీనివాస్, సంజీవరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బాలతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అందరికి సమానంగా రావాల్సిన భూమిని తమ్ముడు ఒక్కడికి చేయవద్దని తహసీల్దార్ రాణిని కోరారు. కొంతసేపు తండ్రి ముగ్గురు కొడుకులు ఘర్షణ పడ్డారు. తహసీల్దార్ రాణి రాములకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా చిన్న కొడుకు ఒప్పుకోలేదు. దీంతో తహసీల్దార్ పోలీస్‌లకు సమాచారం అందించారు. పోలీసులు రాములుతో పాటు కుటుంబ సభ్యులను స్టేషన్‌కు తరలించారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు

కోనరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలం లోని శివంగాలపల్లిలో పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. వెంటనే వారిని సిరిసిల్ల జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివంగాల పల్లి గ్రామానికి చెందిన బిజ్జం ధర్మయ్య, వాణి, అంజి, శ్రీకాంత్‌పై పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. వెంటనే గ్రామస్థులు పిచ్చి కుక్కను చెదరగొట్టి గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో..

- మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారుల సమావేశం
- సరిహద్దుల వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు
- సమాచారం మార్పిడి చేసుకోవాలని నిర్ణయం



సమావేశానికి వెళుతున్న రామగుండం సీపీ, ఐజీ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 24: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో మూడు రాష్ట్రాల సహరిహద్దు జిల్లాల పోలీస్ అధికారుల సమావేశం గురువారం గడ్చిరోలి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా రామగుండం నుంచి హెలికాప్టర్‌లో తీసుకెళ్లారు. శ్రీనివాస్ సమావేశానికి అధ్యక్షత వహించగా గడ్చిరోలి డీఐజీ అంకిత్ గోయల్, సీఆర్‌పీఎఫ్(ఆపరేషన్స్) డీఐజీ అజయ్ శర్మ, కనికెర్ ఎస్పీ కళ్యాణ్, ఎలెసెల, మోహాల మణిపూర్ ఎస్పీ వైపీ సింగ్, గడ్చిరోలి ఎస్పీ నిలోత్పల్, బాంద్ర ఎస్పీ నూరుల్ హసన్, చంద్రపూర్ ఎస్పీ ముమ్మక్క సుదర్శన్, గోండియా ఎస్పీ గోరక్ భమ్రే, భూపాల్‌పల్లి ఎస్పీ కిరణ్‌కారే, ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస్‌లు, నారాయణపూర్ అడిషనల్ ఎస్పీ రాబిన్‌సన్, బీజాపూర్ అడిషనల్ ఎస్పీ దినేష్ సిన్హా తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల దృష్ట్యా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. మావోయిస్టు కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, పరస్పర సమాచారం మార్పిడి చేసుకోవాలని నిర్ణయించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు మూడు రాష్ట్రాల అధికారులు పరస్పర సహకారంతో మెదలాలని నిర్ణయించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు జరుపాలని, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల సరిహద్దు ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ఎన్‌బీడబ్ల్యూ విషయంలో ఇరు రాష్ట్రాల అధికారులు సమాచార మార్పిడి చేసుకోవాలని, ఒకరికొకరు సహకరించుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, గడ్చిరోలి ఎస్పీ(అడ్మిన్) రమేష్, ఆపరేషన్ డీఎస్పీ విశాల్‌నాగార్ గోగె, రామగుండం ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావుతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్‌కు చెందిన పలు జిల్లాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులకు ఓరియంటేషన్ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌నకు హాజరైన ఐదు జిల్లాల అటవీశాఖ అధికారులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24: రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలోని ఐదు జిల్లాల అటవీశాఖ అధికారులకు కరీంనగర్ డీర్‌పార్క్‌లో గురువారం ఒక రోజు ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించారు. అటవీ ప్రాంత అభివృద్ధికి చేపట్టాల్సిన పనుల ప్రణాళికను రూపొందించేందుకు ఈ ఒక రోజు శిక్షణ జరిగింది. 2025-26 నుంచి 2035-36 సంవత్సరం వరకు 10 ఏళ్లల్లో రాజన్నసిరిసిల్ల జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో మొక్కల పెంపకం, చెక్‌డ్యాంల నిర్మాణం, అటవీప్రాణుల సంరక్షణ, చెట్లు కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీప్రాంతాల్లో వివిధ రకాల సర్వే చేసేందుకు ఈ శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణకు అటవీశాఖ జియోమాటిక్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టం(జీఐఎస్) నుంచి ఐఎఫ్‌ఎస్ అధికారి ఐ ప్రకాశ్, కరీంనగర్ డీఎఫ్‌ఓ సీహెచ్ బాలమణి, మెదక్ డీఎఫ్‌ఓ ఎం జోజి, కామారెడ్డి ఎఫ్‌డీఓ రామకృష్ణలు పాల్గొన్నారు. ఈ శిక్షణలో కరీంనగర్. సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలకు చెందిన ఫారెస్టు రేంజి ఆఫీసర్లు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, ఇతర అధికారులు 100 వరకు హాజరయ్యారు. 10 ఏళ్ల ప్రణాళికలను రూపొందించేందుకు ఈ శిక్షణ నిర్వహించామని అధికారులు తెలిపారు.

ఎస్‌యూ కబడ్డీ పోటీల విజేత వివేకానంద జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఈనెల 23న నిర్వహించిన ఉమ్మడి జిల్లా అంతర డిగ్రీ, పీజీ కళాశాలల కబడ్డీ టోర్నమెంట్‌లో వివేకానంద డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొనగా, ఫైనల్‌లో ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల జట్టుపై వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల జట్టు 28-19 పాయింట్ల తేడాతో విజయం సాధించినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పన్యాల శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జట్టును కళాశాల కరస్పాండెంట్ వి ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ అభినందించారు.

మూడు కాలాలు ఆరు పంటలు



బంతి పూల తోట

స్వయంకృషి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయం అంటే వరి అనేలా పరస్థితి ఉండేది.. ఇప్పుడిప్పుడే ఈ పరిస్థితులు మారుతున్నాయి.. పలువురు రైతులు వినూత్న సాగు పద్ధతులు పాటించి లాభాలు గడిస్తున్నారు. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన తాటికొండ కుమార్ ఇలాంటి పద్ధతులే పాటిస్తున్నాడు. తన తండ్రి నుంచి సంక్రమించిన మూడెకరాల భూమిని ఆరు విభాగాలు విభజించాడు. ఆ భాగాల్లో సీజన్‌కు అనుగుణంగా కూరగాయలు, పూల తోటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. ఈ ప్రాంతంలో ఎవ్వరూ వేయని బోడకాకరను పందిరి పద్ధ చేసి మంచి లాభాలు పొందాడు.



కాకరకాయ చేను



బీరకాయ తోట

- కొత్త పద్ధతుల్లో సాగు
- లాభాల పంట పండిస్తున్న యువ రైతు

చొప్పదండి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలం రుక్మాపూర్‌కు చెందిన యువ రైతు తాటికొండ కుమార్ మూస పద్ధతి సాగును వదిలిపెట్టాడు. తన తండ్రి మూడు ఎకరాల భూమిలో వరి సాగు చేస్తుండేవాడు. తండ్రి లాగే వ్యవసాయం చేస్తే లాభం ఉండదని గ్రహించాడు కుమార్. వినూత్నంగా ఆలోచించాడు. ఉన్న మూడు ఎకరాల భూమిని 20 గుంటలకు ఒకటిగా ఆరు విభాగాలుగా విభజించాడు. ఆరు రకాల పంటలను ఎంచుకుని సాగు చేపట్టాడు. పందిరి సాగు కింద మల్చింగ్, డ్రిప్ పద్ధతిలో బోడకాకర, కాకర, బీర కాయ, అలసంద, బంతిపూల సాగును చేపట్టాడు. అధిక లాభాలను పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

భరోసా కల్పించిన బంతి పూల సాగు

రెండు రకాల బంతి పూల సాగును ఎకరం చేనులో మల్చింగ్ విధానంలో సాగు చేశాడు. దసరాకు కొంత భాగం పూలను కోసి విక్రయించగా మరి కొంత దీపావళికి అమ్మేందుకు ప్రణాళిక బద్ధంగా పంట సాగు చేపట్టారు. అధిక దిగుబడితో బంతి సాగు లాభాల పంటగా మారింది.

బోడకాకర సాగుతో లాభల పంట

అతి తక్కువ మంది సాగు చేసే బోడకాకరను కుమార్ 20 గుంటల్లో నాటాడు. ఖర్చుతో కూడుకున్న బోడకాకర కాయ సాగును పందిరి సాగులో విధానంలో చేపట్టాడు. ఆయన కష్టానికి ఫలితం లభించి మంచి దిగుబడి వచ్చింది. తానే మార్కెట్‌కు తీసుకెళ్లి కిలోకు 200 రూపాయల చొప్పున అమ్మాడు. మంచి లాభాలు వచ్చాయి.

కూరగాయలకు డిమాండ్

పందిరి సాగు కింద కుమార్ బోడ కాకరతో పాటు కాకరకాయ, బీరకాయ సాగు చేపట్టాడు. ప్రస్తుతం ఈ మూడింటికి మార్కెట్‌లో మంచి ధర పలుకగా అలసంద కూడా మంచి దిగుబడి వచ్చింది. ధర కూడా కలిసి రావడంతో లాభాల పంట పండింది.

యాసంగిలోనూ కూరగాయల సాగు

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల సాగు చేపడుతూ కుమార్ యాసంగిలో టమాటోతో పాటు ఇతర కూరగాయల సాగుకు సమాయత్తం అవుతున్నాడు. తక్కువ విస్తీర్ణంలో తక్కువ నీటితో అధిక లాభాలను ఇచ్చే పంటలను సాగు చేస్తూ లాభాలను గడుస్తున్న కుమార్ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.



బోడకాకర తోటలో రైతు కుమార్

న్యూస్ బాక్స్

1న కరీంనగర్‌కు బీసీ కమిషన్ బృందం రాక

సిరిసిల్ల అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దమాషాను పేర్కొనే విషయంలో రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడానికి తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబరు 1న కరీంనగర్‌కు వస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు సంబంధించి నవంబరు 1న కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ కమిషనర్ల బృందం అభిప్రాయ సేకరణ జరపనున్నట్లు తెలిపారు. అభిప్రాయాలు, సలహాలు, సూచనలు, తెలియజేయాలనుకున్న వారు రాతపూర్వకంగా అభ్యంతరాలను నేరుగా తెలియజేయవచ్చని తెలిపారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

భగత్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవ త్సరానికి గాను డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్స్ కోర్సు (2 ఇయర్స్ డీఎంఐటీ), డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్ కోర్సు (2 ఇయర్స్)లకు గాను ఇంటర్‌లో బైపీసీ చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బైపీసీ విద్యార్థులు లేనిచో ఎంపీసీ చదివిన వారి నుంచి కూడా దరఖాస్తులు తీసుకుంటామన్నారు. పూర్తి వివరాలు కళాశాల వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సందేహాల నివృత్తికి కళాశాల వేళల్లో సంప్రదిస్తే సిబ్బంది వివరాలు తెలియజేస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

మా భర్తలతో వెట్టి చాకిరి

- రాస్తారోకో చేసిన బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు



సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో బైఠాయించిన పోలీస్‌ల కుటుంబీకులు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పేరుతో బెటాలియన్‌లో కూలీలుగా మార్చి వెట్టిచాకిరి చేయిస్తున్నారని వారి భార్యలతోపాటు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం సిరిసిల్ల 17వ పోలీస్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబీకులు ప్లకార్డులతో భర్తల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలంటూ నిరసన తెలిపేందుకు వచ్చారు. అక్కడే మోహరించిన సిరిసిల్ల పోలీసులు అడ్డుకుని ప్లకార్డులను తీసుకున్నారు. దీంతో ఆగ్రహించిన వారందరూ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగానికి తమ భర్తలు చేస్తున్న పనికి సంబంధం లేకుండా పోయిందన్నారు. పోలీస్ ఉద్యోగం పేరుతో బెటాలియన్‌లో కూలీ పనులు చేస్తున్నారని ఈ విషయాన్ని ఎవరికైనా చెప్పుకోవడానికి నామూషీగా ఉందన్నారు. తమ భర్తలకు ఎనలేని డ్యూటీలు వేసి కుటుంబంతో గడపకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన లేకుండా డ్యూటీలను పోలీస్ అధికారులు వేయడం వలన తమ భర్తలు డ్యూటీ చేయాలంటే భయంతో వణికిపోతున్నారన్నారు. శుభకార్యాలు జరుపుకోవడానికి సెలవులను ఇవ్వకుండా అధికారులు వేధింపులకు గురిచే స్తున్నారని.. ఒకవేళ సెలవు తీసుకోవాలంటూ అధికారులకు లంచాలను ఇవ్వాల్సిందేనని అన్నారు. బెటాలియన్‌లో పనిచేసే వారు చనిపోతే కానిస్టేబుళ్లు అంత్యక్రియలు చేయాలని వాళ్లే డప్పుళ్లు కొట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అమలుచేస్తున్న పోలీస్ విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసి తమ భర్తలకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ మొగిలి అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి ఆందోళనలు చేయవద్దని చెప్పినా ఎవరు వినిపించుకోకపోవడంతో వారిని పోలీసులు బలవంతంగా పోలీస్ వాహనంలో ఎక్కించి సర్ధాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌కు తరలించారు. అక్కడి బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావుతో సమావేశాన్ని ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా బెటాలియన్ కమాండెంట్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని బెటాలియన్‌లలో అమలు చేస్తున్న వాటిని ఇక్కడ కూడా అమలు చేసి విధులను అప్పగించడం జరుగుతుందని అన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదికలను అందిస్తామని తెలిపారు.

మహిళ అదృశ్యం

గంభీరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట గ్రామానికి చెందిన జక్కుల సుమలత అనే 35 ఏళ్ల మహిళ అదృశ్యమైంది. ఈ నెల 22న మంళవారం సుమలతతో పాటు ఆమె భర్త రాజు ఎస్‌బీఐలో పనిమీద గంభీరావుపేట వచ్చారు. అయితే బ్యాంక్ బుక్ వేరే బ్యాంక్‌ది తేవడంతో సుమలతను బ్యాంక్ వద్దే ఉండమని భర్త రాజు ఎస్‌బీఐ పాస్ బుక్ కోసం దేశాయిపేటకు వెళ్లి తిరిగి వచ్చాడు. రాజు వచ్చే సరికి సుమలత బ్యాంక్ వద్ద లేకపోవడంతో ఆందోళనల చెందాడు. చుట్టు పక్కల, బస్టాండ్ ప్రాంతంలో గ్రామం అంతా వెతికినా సుమలత జాడ తెలియలేదు. సుమలత ఆచూకీ కోసం వారి బంధువులు కూడా గాలిస్తున్నారు. ఆందోళనతో సుమలత భర్త రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వికసిత్ భారత్ సెమినార్ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం, అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ 2047 ఇండియా విజన్ ఫర్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ఫిబ్రవరి 4, 5 తేదీల్లో 2025లో జరిగే రెండు రోజుల జాతీయ సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను వీసీ ఉమేష్ కుమార్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతదేశం 2047వ సంవత్సరం నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే స్థిరమైన అభివృద్ధి అవసరమని ఉద్ఘోదించారు. అభివృద్ధి, పారదర్శకత వికసిత్ భారత్ లక్ష్యాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్ వివరించారు. సెమినార్ డైరెక్టర్ శ్రీవాణి మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతదేశం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనేదే వికసిత్ భారత్ 2047 యొక్క ముఖ్య లక్ష్యం అని వివరించారు. కార్యక్రమంలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ సూరేపల్లి సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాఫర్ జరీ, డాక్టర్ కే. పద్మావతి, డాక్టర్ అబ్రహం బాకీ, డాక్టర్ ఉమేరా బేగం, డాక్టర్ నజీముద్దీన్ మునావర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో నురగ

- శాంపిల్స్ సేకరించిన కాలుష్య నియంత్రణ మండలి



గోదావరినదిలో నురగలతో నీటి ప్రవాహం

కోల్‌సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, గోదావరిఖని వద్ద గురువారం గోదావరి నదిలో నురగులు కనిపించాయి. దీంతో పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మహారాష్ట్రలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శ్రీరాంసాగర్ ప్రవాహం పెరగడంతో గోదావరిలోకి నీటిని వదిలారు. దీంతో మహారాష్ట్రలోని లిక్కర్ పరిశ్రమల వ్యర్థాలు గోదావరినదిలో కలువడం వల్ల ఈ నురగలు వస్తున్నట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గోదావరిఖని గోదావరి తీరంలోని పుష్కర ఘాట్ వద్ద నీటి శాంపిల్స్ సేకరించారు. గోదావరి తీరం వెంట ఎస్సారెస్పీ దిగువన సెప్టెంబరులో గణపతి నిమజ్జనం జరిగింది. ఆ రసాయనాల వల్ల కూడా నురుగు వచ్చే అవకాశం ఉందని, ప్రవాహ వేగం పెరిగిన సమయంలోనే ఇలా జరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



శాంపిల్స్ సేకరిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

వెదురుబొంగులతో.. మినియేచర్స్





ప్రతి మనిషిలో ఏదో ఒక ప్రత్యేకత దాగి ఉంటుంది. తనలోని ప్రత్యేకతను గుర్తెరిగి దానికి పదును పెడితే అద్భుతాలు సృష్టించగలుగుతాడు. ఏ పని చేసినా, ఏవృత్తి చేపట్టినా సృజనాత్మకతతో కృషి చేస్తే అందరిలో ప్రత్యేకంగా నిలుస్తారు. తన శక్తి సామర్థ్యాలు పూర్తిగా వెచ్చించి కొత్త దనం కోసం కృషి చేసేవారు రికార్డులు సృష్టిస్తారు. రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన ఊరె నర్సయ్య అగ్గిపెట్టెలో ఇమిడే వెదురు బుట్టలు, చాట తయారీతో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు.

- అగ్గిపెట్టెలో ఇమిడే బుట్టలు, వ్యవసాయ పనిముట్లు
- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న నర్సయ్య
- భూపతిపూర్‌వాసి ప్రతిభ

రాయికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన ఊరె నర్సయ్య తన కుల వృత్తి మ్యాదరి పని చేస్తూ ఖాళీ సమయంలో వెదురు బొంగులతో అద్భుత కళాకండాలను తయారు చేసి అబ్బు రపరుస్తున్నాడు. అతను అగ్గిపెట్టెలో ఇమిడే వెదురు కళాకృతులను బుట్టలు, చాటలు తయారు చేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. వ్యవసాయ సాగు విధానం, వరి వేయడం, ఒడ్లు చెక్కడం, గుంతలు తీయడం, గుల్లలు అల్లడం వంటి కళాకృతులు తయారు చేస్తున్నాడు. వెదురు బొంగులతో సోఫాలు తయారు చేయడం, వివిధ రకాలు కళాకృతులు తయారు చేయడంతో వాటిని చూడడానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆయన ఇంటికి వస్తుంటారు. ఇటీవల వినాయక చవితి వేడుకల్లో నర్సయ్య తయారు చేసిన చెక్క గణపతి గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కొత్తగా ప్రయత్నం చేశా...: ఊరె నర్సయ్య

కుల వృత్తి మ్యాదరి పని చేసుకుంటూ జీవిస్తాను. వెదురు బొంగులతో అందరిలా కాకుండా ఏదైనా కొత్తగా ఆవిష్కరించాలని ప్రయత్నం చేస్తుంటా. సిరిసిల్ల జిల్లాలో అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేత కార్మికులు తయారు చేయడం తనకు స్ఫూర్తిని ఇచ్చింది. అందులో నుంచి పుట్టిన ఆలోచనతోనే అగ్గిపెట్టెలో ఇమిడే కళాకృతులు తయారు చేయాల ఆలోచన వచ్చింది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని నూతన ఆవిష్కరణలు చేస్తా.



చలో జగిత్యాల విజయవంతం చేయాలి

కోరుట్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న ఎంఆర్‌పీఎస్ ఆద్వర్యంలో నిర్వహించు చలో జగిత్యాల విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 30 ఏళ్ల ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేసిన పోరాటానికి మద్దతుగా నిలిచామన్నారు. ఈ నెల 27న జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎల్‌జీ గార్డెన్‌లో నిర్వహించు మహా సభకు మంద కృష్ణమాదిగా ముఖ్య అధిగా పాల్గొని మార్గదర్శకం చేయనున్నట్లు తెలిపారు. మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయ్యాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరుతున్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చెట్టుపల్లి లక్ష్మణ్, సురగు శ్రీనివాస్, బెజ్జెంకి సతీష్, బలవంతుల సురేష్, ఎర్ర శంకర్, చెట్టుపల్లి చిన్న గంగారాం, రాజు గంగారం పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకుంటలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 60 మంది రోగులను రేకుర్తి కంటి వైద్యులు పరీక్షించగా 30 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పిడుగు సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్లాల ప్రతాప్‌రెడ్డి, కోశాధికారి గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ భూమయ్య, పరమేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

పోచమ్మ బోనాలు

రాయికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామంలో గురువారం బొంబాయి పోచమ్మకు భక్తులు బోనాలను ఘనంగా సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్లిన మహిళలు నూతనంగా ప్రతిష్ఠించిన పోచమ్మ విగ్రహం వద్ద బోనాలు సమర్పించారు.

భూ సేకరణ సర్వేను వేగంగా పూర్తి చేయాలి

● కలెక్టర్ బి, సత్య ప్రసాద్

బుగ్గారం అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎచ్ 63 నిర్మాణం కోసం చేస్తున్న భూ సేకరణ పనులను అధికారులు సమన్వయంతో వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. గురువారం బుగ్గారం మండలంలో జాతీయ రహదారుల అథారిటీ అధికారులు చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని, రోడ్డు నిర్మాణంలో రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోతున్న భూమి, ఇండ్లు, కట్టడాలు, చెట్లు, బోర్లు, పైపు లైన్లు, ఇతర నిర్మాణాలను పరిశీలించి, వాటికి చెల్లించాల్సిన నష్ట పరిహారం అంచనా విలువల నివేదికలు తయారు చేసేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కలిసి చేయాలన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన



బుగ్గారం మండలంలో సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్

సర్వేలో భూములు కోల్పోతున్న వారు తెలిపిన అభ్యంతరాలను పరిగణంలోకి తీసుకొని భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎదుర్కోవడం, అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఈ కార్యాక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, సర్వే, రెవెన్యూ, ఫారెస్ట్ హార్టి కల్చర్, సంబంధిత అధికారులు,తహసీల్దార్ మజీద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ బాపురెడ్డి పాల్గొన్నారు.

జడ్పీ పనులు త్వరగా పూర్తి చేయాలి

జగిత్యాల అర్బన్ : జిల్లా పరిషత్ కింద మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జడ్పీ అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరై పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు ఇంకా ప్రారంభం కాని అభివృద్ధి పనులను వెంటనే గ్రౌండ్ చేస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రౌండ్స్‌లో మంజూరు చేసిన పనులు ఏదైనా అనవసరపు పనులు ఉంటే మండల స్థాయిలో సమావేశం నిర్వహించి మార్పులు చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

5వ పేజీ తరువాయి..

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆంధ్రజ్యోతి : జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు గుట్టుచప్పుడు కాకుండా జరు గుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి..ఎలా నియంత్రిస్తున్నారు..?

డీఎంహచ్‌వో: ఇటీవల జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల అంశంపై తెరపైకి వచ్చింది. అయితే లింగ నిర్దారణ జరుపుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పరిశీలనలో గుర్తించలేదు. ఓ ఆసుపత్రిలో అనుమతి లేకుండా ఉంచి అయిదు స్కానింగ్ మిషన్లను సీజ్ చేశాము. కొందరు వైద్యులు గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్దారణ పరీక్షలు చేస్తున్నట్లు వినిపిస్తోంది. గట్టి నిఘా ఏర్పాటు చేశాము. ఎలాంటి అవకతవకలకు పాల్పడిన చర్యలు తప్పవు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి ఏమిటీ...సేవలు ఎలా అందిస్తున్నారు..?

డీఎంహచ్‌వో: జిల్లా వ్యాప్తంగా 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 151 సబ్ సెం టర్లు, 24 గంటలు పనిచేసే 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 102 పల్లె దవా ఖానాలు, 5 బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాము. వీటికి తోడు 108 వాహనాలు 12, 102 వాహనాలు 6 ఉన్నాయి. దీంతో పాటు మూడు క మ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జగిత్యాల ప్రధాన ఆసుపత్రి, మాతా శిశు కేంద్రం ద్వారా వైద్య సేవలను ప్రజలు పొందుతున్నారు. డయాగ్నిక్ సెంటర్, రేడియా లజీ సెంటర్, టీ హబ్‌ల ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత ఏమైనా ఉందా..?

డీఎంహచ్‌వో: కలెక్టర్ ఆదేశాలు, సలహాలు, సూచనలతో ప్రస్తుత సీజన్‌లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత ఏర్పడకుండా సేవలు అందించాము. ఎప్పటికప్పుడు ఎక్కడెక్కడ మందులు కావాలో సమాచారం సేకరించి సరఫరా చేశాము. ప్రోగాం అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలను సందర్శించి పర్యవేక్షణ జరిపారు.

5వ పేజీ తరువాయి..

జీఎస్టీ, కెమికల్స్ ధరలు తగ్గినా..

టపాసుల అమ్మకాలపై జీఎస్టీ, కెమికల్స్ ధరలు తగ్గినా ధరలు మాత్రం దిగ లేదు. గత ఏడాదితో పోలిస్తే అ ధికంగా పెరిగాయి. అవి కూడా కొన్ని రకాలే ఉన్నాయి. మరికొన్ని రకాల్లో మార్పు లేదు. గతంలో దీపావళి సామగ్రిపై 23 శాతం జీఎస్టీ ఉండేదని, ప్రస్తుతం అది 18 శాతానికి దిగిందని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ఇటు తయారీకి వాడే కెమికల్స్ ధరలు కూడా తగ్గాయి. ఈ కారణంగా ఈ ఏడాది టపాసులు ధరలు భారీగా తగ్గుతా యని భావించారు. కానీ అనుకున్న స్థాయిలో ధరలు దిగి రాలేదు. ఇక ధరల విషయానికి వస్తే కాకర వొత్తులు సాధారణ రూ. 75 ఉంది. ఇదే రకం పువ్వులు అయితే రూ. 30 నుంచి రూ. 100 వరకు ఉంది. భూచక్రాల బాక్స్ రకాన్ని బట్టి రూ. 100 నుంచి 150 మధ్య ఉంది. చిచ్చి బుడ్డుల రకాన్ని బట్టి ధరలు ఉన్నాయి. చిన్నవి రూ. 60 నుంచి 80, పెద్దవి రూ. 100 పలుకుతున్నాయి. చిన్నారులు ఇష్టంగా కాల్చే పెన్సిల్స్ ధరలు కూడా రూ. 50కి చేరింది. 1000 వాలా బాక్స్ రూ. 300, అదే 5000 వాలా అయితే రూ. 1,200 పలుకుతుంది. ఇక మిగిలిన టపాసులు ధరలు కూడా గత ఏడాదితో పోలిస్తే భారీ గానే పెరిగాయని వినియోగదారులు అంటున్నారు. లేబర్, ట్రాన్స్‌పోర్టు, దుకాణాల అద్దెలు తదితర పెరుగుదల ప్రభావం టపాసులపై పడిందని, అందుకు ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

● సాధారణ ప్రసవాల కోసం వైద్యులు కృషి చేయాలి ● ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

రాయికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్ర భుత్వ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రిలో ఐపీ, ఓపీ సేవలు బాగున్నాయని, ఆస్పత్రిని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆపరేషన్ థియేటర్,



ఆస్పత్రిని పరిశీలిస్తున్న సంజయ్ కుమార్

బెడ్‌ల సదుపాయం, కొన్ని మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాధారణ ప్రసవాల కోసం వైద్యులు కృషి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుతో నాణ్యమైన వైద్యం అందుబాటులోకి రానుందన్నారు. కుక్క కాటుకు సంబంధిం చిన కేసులు కూడా అధికంగా వస్తున్నాయని, ఎనిమల్ కేర్ సెంటర్‌ను జగిత్యాలలో ప్రారంభించుకున్నామని, యాంటీ రేబిస్ ఎల్లప్పుడూ ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం జీవో నెం.317 ద్వారా తమకు అన్యాయం జరిగిందని నర్సింగ్ సిబ్బంది వినతి పత్రాన్ని అందించగా, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వైస్ చైర్మన్ రమాదేవి, డీసీహెచ్ఎస్ రామకృష్ణ, మెడికల్ ఆఫీసర్ శశికాంత్ రెడ్డి, డాక్టర్ రజిత, తహసీల్దార్ ఖయ్యూం, వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలోని కిష్టంపేట గ్రామంలో బొంబాయి పోచమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుంపెటలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, నియోజకవర్గ ఎన్ఎస్‌యుఐ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల సంతోష్ పంపిణీ చేశారు. ఎండీ రహీంకు రు. 17,500, ఎండీ రషీద్ కుటుంబ సభ్యులకు రు. 60 వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా చెదలు రమేశ్, తీగల మధు, నక్క రాజేశం, గడ్డం మధు తదితరులు ఉన్నారు.

మాలల సమస్యలను పరిష్కరించాలి

ముస్తాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాల సామాజిక వర్గ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మాల మహానా డు జిల్లా అధ్యక్షుడు తుంగ శివరాజం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమాకమైన ఏఎంసీ చైర్మన్ తలారి రాణినర్సింలు, ఏఎంసీ డైరెక్టర్ క్యారం రాజును సన్మానించారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు జంగ భూమరాజం, నాయకులు జక్కుల యాదగిరి, యారటి కరుణాకర్, కృష్ణ, రమేశ్, రాజు పాల్గొన్నారు.

టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాయికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న పీజీటీ బాటనీ టీచర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కొల్లురి సంతోష్ తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునేవారు ఎమ్మెస్సీ బాటనీ, బీఈడీ పాస్ అయి ఉండాలన్నారు. ఈ నెల 28 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు, 29న మంగళవారం ఉదయం 10 గంటలకు డెమో తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

రాయికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అల్లీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది రికార్డులు, ఇమ్యూనైజేషన్, లెప్రసీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జి నర్సింగారావు

కోరుట్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగారావు అన్నారు. గురువారం పట్టణంలోని జీఎస్ గార్డెన్‌లో కోరుట్ల, మల్లాపూర్, ఇబ్రహీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్లు పన్నాల అంజిరెడ్డి, వనతడుపుల పుప్ప - నర్సయ్య, బోరిగం రాజులతో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. నియోజకవర్గంలోని 72 మంది లబ్ధిదారులకు రూ. 28.04 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సింగ రావు మాట్లాడారు. ప్రజల కొసం పని చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేద మధ్య తరగతి ప్రజల అభివృద్ధి సంక్షేమం కొసం అహర్నిశలు కృషి చేస్తుంది రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ గడ్డమీది పవన్, మున్సిపల్ కౌన్సిలర్లు ఎంబేరీ నాగభూషణం, మోర్తాడ్ లక్ష్మినా రాయణ, నాయకులు అంజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్, మచ్చ కవిత, పెరమాండ్ల సత్యనారాయణ, ప్రభాకర్, మధు, భూమయ్య, విజయ్, రిజ్వాన్ పాషా, సోగ్రబీ, పలువురు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న జువ్వాడి నర్సింగారావు

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కృషి

కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగారావు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మిక కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేసియా ప్రకటిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు అన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఉత్తర్వులు జారీ చేయడం పట్ల నర్సింగరావు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేక రులతో మాట్లాడుతూ గల్ఫ్ కార్మికుల బాధలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్ పదేళ్ల అధికారంలో ఉండి గల్ఫ్ కార్మికుల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు.

న్యాయవాదులకు పూర్తి సహకారం ఉంటుంది

సినియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బార్ అండ్ బెంచ్ స్నేహపూర్వక సంబంధాల్ని కొనసాగిస్తానని, న్యాయవాదులకు పూర్తి సహకారం ఉంటుందని సినియర్ సివిల్ కోర్టు జడ్జి నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన మెట్‌పల్లి కోర్టు సినియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి కోర్టుకు మొదటి అధికారిగా రావడం సంతోషంగా ఉందన్నారు. నూతన కోర్టు అయినందున కోర్టులో అన్ని రకాల సౌకర్యాల కల్పనకు సహకరిస్తానని అన్నారు. మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో విరివిగా న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిద్దామన్నారు. కార్యక్రమంలో బార్ అసో సియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, సినియర్ న్యాయవాదులు వెంకటనర్సయ్య, వెంకటస్వామి, ప్రవీన్ పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు

● మిషన్ భగీరథ సీఈ అమరేంద్ర

పెగడపల్లి, అక్టోబరు 24 : రాబోవు వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ సీహెచ్.అమరేంద్ర పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని వెంగళాయిపేట, పెగడపల్లి తదితర గ్రామాలలో ఆ శాఖ జిల్లా, డివిజన్ అధికారులతో కలసి సీఈ అమరేంద్ర గు రువారం పర్యటించి తాగునీటి పథకాలు, ఇబ్బందులు, తీసుకోవాల్సిన చర్యలు గూర్చి పరిశీలించారు. ఈ సందర్భంగా పెగడపల్లి గ్రామపం చాయతీలో సీఈ విలేఖరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో పర్యటించి తాగు నీటి పథకాలు, గ్రామ పంచాయతీలను పరిశీలించి ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలు, తాగు నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. తాగు నీటి పైపులైన్లు లేని వీధులను గుర్తించి వాటి నిర్మాణానికి అవసరమగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆ శాఖ డివిజన్, మండల స్థాయి అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లే పైపులైన్ అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఈఈ రమేష్, డీఈఈ మురళి, ఏఈ లక్ష్మీప్రసన్న, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, స్వామి తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కోరుట్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ పార్యాన్ మెడికేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం కోరుట్ల బార్ అసోసియేషన్ పరివే క్షణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని కోరుట్ల జూ నియర్ సివిల్ న్యాయమూర్తి అరుణ్ కుమార్ ప్రారంభించి ఆసుపత్రి వైద్యులచే వైద్య పరీక్షలను నిర్వహించుకున్నారు. అనంతరం బార్ అసోసియేషన్ సభ్యులకు వైద్య పరీక్షలను జరిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీర్ శ్రీనివాస్ రావు, కార్యదర్శి సుతారి శ్రీనివాస్ న్యాయవాదులు తోట అంజనేయులు, రాజాశేఖర్, రాజేష్ ఖన్నా, చాప కిశోర్, ఫసియొద్దిన్, రోజా,దీప, బైరి విజయ్, వైద్యులు అబ్దుల్ రహమాన్, అర్షియా, అయేషా, శిబిరం ఇన్‌చార్జి గణేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

చందుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి చెందిన వాసం ప్రసాద్ అనే నిరుపేద ఆటో డ్రైవర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి గ్రామస్థులు 12 వేల రూపాయలు ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ కుసుంబ జనార్దన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన తోటి స్నేహితులను గ్రామస్థులు అభినందించారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు



మెట్‌పల్లి పాత బస్టాండ్‌లో బీఆర్ఎస్ శ్రేణులకు అభివాదం చేస్తున్న కేటీఆర్

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటిఆర్ గురువారం మెట్‌పల్లికి రాగ బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆదిలాబాద్ పర్యటనను ముగించుకుని కేటీఆర్ కరీంనగర్‌లో గంగుల కమలాకర్‌ను పరామర్శించేందుకు వెళ్తుండగా మార్గ మాధ్యలో మెట్‌పల్లిలో కాసేపు ఆగారు. కేటీఆర్ మెట్‌పల్లికి వస్తుండటంతో నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు పట్టణం లోని పాత బస్టాండ్ వద్ద ఘన స్వాగతం పలికారు. కారులోనుంచి కేటిఆర్ కార్యకర్తలకు అభివాదం చేశారు. కార్యకర్తలు కేటీఆర్‌పై పూల వర్షంకు రిపించారు. సీఎం సీఎం అంటు కార్యకర్తలు జోష్‌తో నినాదాలు చేశారు. అంతకు ముందు కేటీఆర్ తన స్నేహితుడు బీఆర్ఎస్ నాయకులు జాన్సన్ నాయక్ ఇంటికి వెళ్లి ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. తేనేటి విందు స్వీకరించారు. కేటిఆర్ వెంట ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్ నాయ కులు జాన్సన్ నాయక్‌లు ఉన్నారు.

● కేటీఆర్ మెట్‌పల్లి పర్యటనలో భాగంగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కారును తనే స్వయంగా డ్రైవింగ్ చేస్తు కనిపించాడు. కేటీఆర్, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్ నాయకులు జాన్సన్ నాయక్‌లు ఒకే కారులో కలిసి కరీంనగర్ బయలుదేరారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మల్యాల సింగిల్‌విండో ఆధ్వర్యంలో సర్వాపూర్‌లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ఎం.రాంలింగారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఈవో శ్రీనివాస్, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్, మాజీ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు

జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లా బాలికల కబడ్డీ టోర్నమెంట్‌లో రన్నర్ అప్‌గా విజయం సాధించారు. ఎస్‌జీఎఫ్ అండర్19 ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలికల కబడ్డీ టోర్నమెంట్‌లో ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో ప్రతిభ కనబరచి రన్నర్ అప్‌గా నిలిచారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ రాజేందర్, అధ్యాపకులు అభినందించారు.

ఓటర్ నమోదు కేంద్రం ప్రారంభం

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ట్రస్మాఆధ్వర్యంలో మల్యాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటర్‌నమోదు కేంద్రంను ట్రస్మా రాష్ట్ర నాయకులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు ప్రారంభించారు. పట్టభద్రులు తమఓటు నమోదు చేసుకోవడంతో పాటు తప్పకుండా వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు బోగ రవిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రతాప్ కిషన్‌రావు, పోకల నరేశ్‌కుమార్, దయానంద్ పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ రద్దు

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల బీజేపీ కమిటి రద్దు అయింది. ఈ మేరకు కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రకటన జారీ చేశారు. చొప్పదండి నియోజకవర్గంలోని మల్యాల మండల కమిటి రద్దు తక్షణమే అమలులోకి వస్తుందని అందులో పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు అభినందన

పెగడపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని సుద్దపల్లికి చెందిన క్రికెట్ జట్టు డివిజన్ లెవల్ టోర్నీలో విజయం సాధించడాన్ని హర్షిస్తూ గురువారం ఆ జట్టు సభ్యులను గ్రామంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నదీమ్ హుస్సేన్, తాజా మాజీ సర్పంచ్ హారిక గంగాధర్‌ల ఆద్వర్యంలో జట్టు సభ్యులను సత్కరించి అభినందించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

కోరుట్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల అమరవీరుల వారోత్సవంలో భాగంగా గురువారం విద్యార్థులకు పోలీసులు చట్టాలపై అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొనగా వారికి పోలీస్ స్టేషన్ అవరణపై సిబ్బంది వివరించారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించి పిర్యాదు చేసే విధనంపై ఎస్ఐ శ్రీకాంత్ విద్యార్థులకు వివరించారు. విద్యతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మత్తు పథర్థాలకు బానిసలు కాకుండి విద్యపై శ్రద్ధ చూపి ఉన్నత శిఖిరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కేరళా ఇంగ్లీష్ మీడియం కరస్పాడెంట్ బారీ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్‌లో ఓపెన్ హౌజ్ పోలీసుల అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం పోలీసు స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆయుధాల పనితీరు, బాధితుల ఫిర్యాదు నమోదు, లాక్ అప్, పోలీసుల విధులు, వారి హోద వంటి తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్ : పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌజ్ ప్రదర్శనలో భాగంగా చట్టాలు, అయుధాల మీద అవగహన కల్పించారు. శాంతి భద్రతాల పరిరక్షణలో భాగంగా పోలీస్‌లు వాడే ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరికరాలను ప్రదర్శించి వాటి గురించి విద్యార్థులకు వివరించారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్ : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వాహణకు సంబంధించిన వివరాలను విద్యార్థులకు వివరించారు. నేరాల నమోదు రికార్డులు, సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌లో రిసిప్షన్, ఫిర్యాదుల స్వీకరణ, నేరస్తులకు సంబంధించిన వివరాల ప్రదర్శన గురించి విద్యార్థులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నవీన్, హెడ్ కానిస్టేబుల్ మధుకర్, సిబ్బంది శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.



ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు